# నిర్దిష్ట కాలపరిమితి ఒప్పంద ఉద్యోగాలు(ఎఫ్‌టిసి)

## కాంట్రాక్టు ఉద్యోగులను చట్టబద్ధంగా గుర్తిస్తామని మభ్యపరిచే చర్యలు

**నిర్దిష్ట** కాలపరిమితి ఒప్పందంపై కార్మికులను పనిలో పెట్టుకునేందుకు యజమానులకు అనుమతి నిస్తూ ప్రభుత్వం నిర్ణయించిందని 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా ఆర్థిక శాఖామంత్రి ప్రకటించాడు.

ఈ ప్రకటన కొనసాగింపుగా 'పారిశ్రామిక ఉద్యోగ విధి విధానాలు-1946' సవరించబడింది. తద్వారా నిర్దిష్ట కాలపరిమితి ఒప్పందంపై యజమానులు కార్మికులను పనిలోకి తీసుకో వటానికి, అవసరానికి తగిన విధంగా, తాత్కాలిక ప్రాతిపదికపై కార్మికులను పనిలోకి తీసుకోవటానికి మరింత వెసులుబాటును కల్పించారు.

ఈవిధంగా కేంద్రప్రభుత్వం పరిశ్రమ యాజమాన్యాల పనిని సులభతరం చేసింది. యాజమాన్యాలు కాంట్రాక్టు ప్రాతిపదికపై నిర్దిష్ట కాలంమేరకే అనగా అవ్యక్తంగా అతి తక్కువకాలం మేరకే కార్మికులను పనిలోకి తీసుకుంటారు. ఒప్పంద కాలపరిమితి ముగుస్తూనే ఆ కార్మికుడికి ఏ విధమైన నోటీసూ ఇవ్వాల్సిన అవసరం లేకుండానే, తొలగింపు పరిహారం వంటివేవీ చెల్లించాల్సిన అవసరం లేకుండానే తొలగించవచ్చు. ఒప్పంద పరిమితి ముగిసిన తర్వాత యాజమాన్యాలు దానిని పునరుద్ధరించాల్సిన అవసరమేమీ లేదు.

ఎప్పటిలాగానే, 'ఫిక్కి' ఎన్‌డిఏ ప్రభుత్వ ఈ చర్యను స్వాగతించింది. వ్యాపార నిర్వహణను ఈ చర్య మరింత సులభతరం చేస్తుందని ప్రభుత్వాన్ని ప్రస్తుతించింది.

2018 ఫిబ్రవరిలో రాష్ట్రప్రభుత్వాల ప్రతినిధులు, కార్మిక యూనియన్ల ప్రతినిధులు మరియు పారిశ్రామిక యాజమాన్యాల ప్రతినిధు లతో కార్మిక మరియు ఉద్యోగ మంత్రిత్వశాఖ సంప్రదింపుల సమావేశం అనంతరం ఈ చర్య వెలువడింది. నిర్దిష్ట కాలపరిమితి కాంట్రాక్టులకు (ఫిక్స్‌డ్ టరమ్ కాంట్రాక్టులకు-ఎఫ్‌టిసిలకు) ఈ సమావేశంలో పాల్గొన్న 12 రాష్ట్రప్రభుత్వాల ప్రతినిధులు అనుకూలంగా అంగీకారం తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ బిఎంఎస్, నేషనల్ ఫ్రంట్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఎన్‌ఎఫ్‌టియు), ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ కమిటి(టియుసిసి) ఈ చర్యను స్వాగతించాయి. యూనియన్ బడ్జెట్‌లో ఈ చర్యను ప్రకటించే ముందుగా తమతో చర్చలు జరపకపోవటాన్ని నిరసిస్తూ మిగిలిన ఇతర ట్రేడ్ యూనియన్లు సమావేశాన్నుండి బయటకు వచ్చేశాయి.

'అతి గొప్ప కార్మిక సంస్కరణ'గా పారిశ్రామిక యజమానుల సమర్థకులు ఈ చర్యను కీర్తిస్తున్నారు.

వాస్తవానికి, ఎఫ్‌టిసి అనే ఈ చేదుమాత్ర-ఈ చర్య ఎక్కువ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని, మరింత భద్రతా పనిపరిస్థితులను కలగజేస్తుందనే పంచదార పూతలతో కూడుకుంది. ఎఫ్‌టిసి కార్మికులకు కూడా పర్మినెంటు కార్మికులతో సమానంగా పనిగంటలు, వేతనాలు, భత్యాలు లభిస్తాయని హామీ ఇస్తున్నారు. అలాగే పర్మినెంటు కార్మికులతోపాటు పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ మరియు పనిప్రదేశాల్లో మరణాలు, ప్రమాదాల సందర్భాలలో పరిహారాలు లభిస్తాయని ఊరిస్తున్నారు. ప్రపంచవ్యాపితంగా విమర్శల నెదుర్కొంటూ వ్యతిరేకించబడుతున్న కాంట్రాక్టు పనివ్యవస్థను ఇలాంటి ఎరలువేసి కార్మికులచే ఆమోదింపజేసుకునే ప్రయత్నమిది.

2016 అక్టోబర్ నుండి తోళ్ళు మరియు దుస్తుల పరిశ్రమలలో ఎఫ్‌టిసిని అనుమతించి, ఇపుడు దానిని అన్ని విభాగాలకు విస్తృత పరుస్తున్నారు.

పారిశ్రామిక వార్షిక సర్వే అందించిన గణాంకాల ప్రకారం - పరిశ్రమలలోని మొత్తం కార్మికుల సంఖ్యలో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పరిగణించదగిన విధంగా పెరుగుతూవస్తోంది. 2014-15 కాలంలో, పరిశ్రమల్లో పనిచేస్తున్న మొత్తం కార్మికులలో మూడవవంతు కార్మికులను ఒప్పందాల ద్వారా తాత్కాలిక కార్మికులుగా తీసుకున్నారు. మిగిలిన వారికంటే వీరి ఉద్యోగ విధి విధానాలు ఘోరంగా వున్నాయి. అన్ని చట్టబద్ధ సౌకర్యాలు కల్పించి పర్మినెంటు కార్మికులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చెందిన వివిధ విభాగాలు ఈ విధమైన ఘోరమైన పనిపరిస్థితులను, విధివిధానాలను ఖండించి, తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కాంట్రాక్టు కార్మికులకు కూడా పర్మినెంట్ కార్మికులకు వలెనే చట్టబద్ధమైన అన్ని సదుపాయాలను కల్పించి, వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలనేది ఈ యూనియన్లన్నింటియొక్క ప్రాథమికమైన డిమాండ్‌గా వుంది.

అయితే, కాంట్రాక్టు కార్మికుల ఈ ప్రాథమికమైన, అవసరమైన డిమాండ్‌ను పట్టించు కోకుండా ఎన్‌డిఏ ప్రభుత్వం, స్థిర ఉద్యోగాల అవగాహననే తిరస్కరించే ద్వితీయస్థాయి వాగ్దానా లతో కార్మికులను మోసగించే మార్గం ఎంచుకుంది. కాంట్రాక్టు కార్మికులపట్ల చూపుతున్న వివక్షను తొలగించటానికి ఎఫ్‌టిసి తోడ్పడుతుందనే అవాస్తవిక వాగ్దానాలతో-కార్మికుల స్థిరఉద్యోగ కల్పన, ఉద్యోగభద్రతలనే కార్మికుల డిమాండ్లను పట్టించుకోకుండా ఎగవేయటంలో ఎన్‌డిఏ ప్రభుత్వం విజయం పొందింది. ఈ విధంగా ఉద్యోగం పొందడం ప్రజల హక్కు అనే భావనను తోసిపుచ్చుతోంది. 'అధిక ఖరీదు అయినప్పటికీ, ఈ విధానం

అనివార్యమంటూ ప్రస్తుత వ్యవస్థ సమర్ధకులు ఎఫ్‌టిసి నిబంధనలను కొనియాడు తున్నారు. ఎఫ్‌టిసి 'గొప్ప లక్షణాలను' స్తుతిస్తూ పాలకులు, వారి వందిమాగధులు ఎన్నిరకాలుగా చాటింపు వేసుకున్నప్పటికీ ఎఫ్‌టిసి వ్యవస్థ అనేది ప్రతి శ్రామికుడు తన సహజ హక్కుగా భావించే స్థిర ఉద్యోగ వ్యవస్థను, ఉద్యోగభద్రతను సంపూర్ణంగా తొలగించివేసేందుకు చట్టబద్ధమైన తొలి అడుగు అనేది స్పష్టం.

ఎఫ్‌టిసి అనేది ఎన్‌డిఏ పాలకులు కొత్తగా కనుగొన్న విధానమేమీ కాదు. యూరపులో అనేక దేశాలలోని పారిశ్రామిక యాజమాన్యాలు- చట్టం ద్వారా కల్పించబడిన ఉద్యోగభద్రతను తప్పించ టానికి, కార్మికులకు కల్పించాల్సిన సదుపాయాలకు వెచ్చించాల్సిన ఖర్చును తగ్గించుకోవటానికి ఎఫ్‌టిసి వ్యవస్థను ఎంచుకున్నాయి. ఎఫ్‌టిసి క్రిందనే పరిగణించదగిన స్థాయిలో ఉద్యోగ ఒప్పందాలు జరుగుతున్నాయని ఎఫ్‌టిసి వ్యవస్థ అనుభవాలు తెలియజేస్తున్నాయి. అయితే ఉద్యోగ కల్పనా దారులైన యజమానులు, ఎఫ్‌టిసి ఉద్యోగులను స్థిర ఉద్యోగులుగా మార్చటానికి విముఖంగా వుంటున్నారు. స్పెయిన్‌లో ఉద్యోగాలలోకి చేరే వారిలో 90శాతం మంది ఎఫ్‌టిసితోనే తమ ఉద్యోగ జీవితాన్ని ప్రారంభిస్తున్నారు. తర్వాత వీరు స్థిర ప్రాతిపదికన ఉద్యోగం పొందే బదులుగా తమ జీవితకాలం ఎఫ్‌టిసిగానే పనిచేయటమో, అతి తరచుగా నిరుద్యోగులుగా మిగలటమో లేక స్వయం ఉపాధిని చూసుకోవలసిరావటమో జరుగుతోంది. భారతదేశంలో ఎఫ్‌టిసి కార్మికులకు కూడా ఇదే పరిస్థితి దాపురించే అన్ని అవకాశాలూ వున్నాయి.

ఇంతేగాక, పర్మినెంట్ కార్మికులపై ఎఫ్‌టిసి చెడు ప్రభావాన్ని చూపుతుంది కూడా. యాజమాన్యాలు ఎఫ్‌టిసి కార్మికులను తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగించు కుంటూ పర్మినెంట్ కార్మికుల బేరసారాలాడే శక్తిని క్షీణింపజేస్తాయి. ఎఫ్‌టిసి కార్మికులపై రాధికా కపూర్, పి.పి.కృష్ణప్రియలు సాగించిన అధ్యయనం కూడా ఇదే విషయాన్ని రుజువుచేస్తోంది: "భారత దేశంలో ఒప్పంద కార్మికుల సంఖ్య పెరగటమనే అంశం, కార్మికుల బేరసారాలాడే శక్తిని తగ్గించింది. అలాగే, పనిచేస్తున్న కార్మికుల వేతనాలను తగ్గించేందుకు పారిశ్రామిక యాజమాన్యాలకు సులభతరం అయ్యింది. సంఘటిత తయారీరంగం లోకి నేరుగా తీసుకుంటున్న ఒప్పంద కార్మికుల నిజవేతనాలు, గత 15 సం॥లుగా ఎదుగూబొదుగూ లేక స్థంభించి వున్నాయని, దీనిని ఎఫ్‌టిసి విధాన ఫలితంగా పరిగణించ వచ్చున'ని వారు తమ అధ్యయనంలో తెలియ జేశారు.

అనేక విభాగాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు తీవ్రమైన ఆందోళనలతో ముందుకు వస్తున్నారు. వీరు తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణకోసం, మెరుగైన పనిపరిస్థితులకోసం డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు కార్పొరేషన్‌కు చెందిన కాంట్రాక్టు కార్మికులు ఇటీవల కాలంలో దీర్ఘకాల ఆందోళన చేపట్టారు. ముంబయికి చెందిన 1500 మంది రైల్వే కాంట్రాక్టు ఉద్యోగులు, తమను నేరుగా రైల్వేలో పర్మినెంట్ ఉద్యోగాలలో చేర్చుకోవాలని డిమాండ్‌చేస్తూ, ఉద్యోగ కల్పనలో ఈ కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ మెరుపు ఆందోళన నిర్వహించారు. నూతన ఎఫ్‌టిసి వ్యవస్థ ముసుగులో ఎన్‌డిఏ పాలకులు, ఈ కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థను చట్టబద్ధం చేస్తున్నారు.

పర్మినెంట్ కార్మికులతో సమానంగా ఎఫ్‌టిసి ద్వారా చేర్చుకునే కాంట్రాక్టు కార్మికులకు కూడా అన్ని చట్టబద్ధ సదుపాయాలను కల్పించటమే ఎఫ్‌టిసి వ్యవస్థ మేలైన లక్షణంగా కీర్తిస్తున్నప్పటికీ, నూతనంగా సవరించబడిన ఈ చట్టంలోని నిబంధనలను, యాజమాన్యాలు ఖచ్చితంగా అమలుచేస్తాయనే గ్యారంటీ ఏమీలేదు. గతంలో కార్మిక చట్టాలను అమలుచేయకుండా యధేచ్ఛగా ఉల్లంఘించిన తీరులోనే దీని అమలుకూడా వుండబోతోంది. కార్పొరేటు విభాగానికి చెందిన హెచ్‌ఆర్‌శాఖలు తామే కనిపెట్టిన అనేక సాకుల తోనో, మరొక దానితోనో, ఈ చట్టాల అమలును ఎగవేయడంలో నిష్ణాతులుగా వున్నాయి. మారుతీ సుజుకీ కార్మికుల కేసులోవలె అనంతంగా వ్యాజ్యాలను లేవనెత్తుతాయి.

ఎప్పటిలాగానే, సాంప్రదాయ కార్మిక యూనియన్ కేంద్రాలు – ఎఫ్‌టిసికి వ్యతిరేకంగా మొక్కుబడిగా నిరసన తెలిపాయి. ఉద్యోగహక్కు, శాశ్వత ఉద్యోగం, ఉద్యోగభద్రతవంటి సహజ హక్కులను భారతదేశ కార్మికులు కోల్పోతుండటం అనే ఎఫ్‌టిసియొక్క వాస్తవిక దుష్ఫలితాల ప్రభావం గురించికంటే యూనియన్ బడ్జెట్‌లో దీనిని ప్రకటించబోయే ముందుగా, దీనిగురించి తమను ప్రభుత్వం సంప్రదదించలేదనే దాన్ని గురించే వీరు ఎక్కువ బాధపడుతున్నారనేది స్పష్టం.

బడాబూర్జువా వర్గాల పనుపున పాలకులు, పాలకవర్గాలు సాగిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు, కార్మికులపై దాడులకు వ్యతిరేకంగా ప్రస్తుతం సాగిస్తున్న విధంగా సాంప్రదాయక విధానంతో మొక్కుబడిగా నిరసనలు సాగించటం కాకుండా మనదేశ కార్మికవర్గం–కార్మికులను నిలకడగా చైతన్యపరచి, వారిని ఐక్యంచేసి, వర్గకసితో తమ ప్రయోజనాల పరిరక్షణకోసం పోరాడేవిధంగా వారిని సంసిద్ధం చేయటానికి చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నాలు సాగించాలి.

ooooo